నేటి కందం- నేటికి అందం



సుందర యానము కొరకై
ముందుగ యోచన నొనర్చి ముచ్చట గొలుపన్
"వందేభారత్"రైళ్ళను
వందితుడైనట్టి మోడి ప్రారంభించెన్ !!

(బెంగుళూరు లో ఒకే రోజున 3 వందే భారత్ రైళ్లను ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

పుస్తకాలు కొన్నిటిని
కాశ్మీరులో నిషేధం
అక్షరాన్ని ప్రభుత్వం
అణిచివేసె విషాదం.
ప్రజాస్వామ్య భావస్వేచ్ఛ
ప్రమాదం ఎట్లంటరు
నిరంకుశ పాలనలో
నేడు ప్రజలు ఎట్లుంటరు.



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 12-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93. Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:8 పేజీలు:6 వెల: రూ.1/-


# మాది అణ్వాయుధ దేశం.. మేం నాశనమైతే సగం ప్రపంచాన్ని మాతో తీసుకెళ్తాం..

## -భారత్‌పై మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడ్డ పాకిస్థాన్ ఆర్మీ ఫీల్డ్ మార్షల్

వాషింగ్టన్ ఆగస్టు 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఆపరేషన్ సిందూర్‌తో భారత్ చేత చావుదెబ్బ తిన్నప్పటికీ దాయాది పాకిస్థాన్ తీరులో ఎలాంటి మార్పు లేదు. తాజాగా పాకిస్థాన్ ఆర్మీ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిం మునీర్ మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన భారత్ పై నోరు పారేసుకున్నారు. తమది అణ్వాయుధ దేశమని, అవసరమైతే అణుయుద్ధానికి దిగుతామంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగారు. తాము నాశనమైతే.. తమతోపాటు సగం ప్రపంచాన్ని తీసుకెళ్తామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫ్లోరిడాలోని టాంపాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మునీర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా సింధునది వివాదాన్ని ప్రస్తావిస్తూ.. భారత్‌పై నోరుపారేసుకున్నారు. సింధు నది భారతీయుల ఆస్తిఏమీ కాదంటూ వ్యాఖ్యానించారు. ఆ నదిపై భారత్ డ్యామ్‌లు నిర్మించే వరకు ఎదురు చూస్తామని చెప్పారు. తమ వద్ద క్షిపణులకు ఎలాంటి కొదవ లేదని, ఆ డ్యామ్‌లను పది క్షిపణులతో పేల్చేస్తామని హెచ్చరించారు. భారత్ నుంచి తమ అస్థిత్వానికి ముప్పు ఏర్పడితే, తాము నాశనం అవుతూనే సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు.కాగా, అసిం మునీర్ యూఎస్ సందర్శనకు వెళ్లడం రెండు నెలల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈఏడాది జూన్‌లో అసిం మునీర్ అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీ సందర్భంగా ట్రంప్ వైట్ హౌస్‌లో మునీర్‌కు ప్రత్యేకంగా విందు కూడా ఇచ్చారు. ప్రతీకార సుంకాల నేపథ్యంలో భారత్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో.. వాషింగ్టన్‌తో పాకిస్థాన్ సంబంధాలు బలపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

# మంత్రి పదవి ముఖ్యం కాదు.. అవినీతి రహిత పాలన అందించాలి

## - మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

హైదరాబాద్ ఆగస్టు 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మంత్రి పదవి ఇస్తామన్న హామీని అధిష్టానం అమలు చేయలేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. మంత్రి పదవి హామీ వాస్తవమేనని తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చెప్పారని అన్నారు. భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్పందించారు. రాష్ట్ర ముఖ్యనేతలు అడ్డుకుంటూ, అవమానిస్తున్నారన్న వాస్తవాన్ని మీడియా ద్వారా ప్రజలకు వివరించిన భట్టికి ధన్యవాదాలు తెలియజేశారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదని, తెలంగాణ సమాజ ఆకాంక్షలు నెరవేర్చేలా పాలన ఉండాలని ఆశిస్తున్నాని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సర్కారు అమలు చేయాలని, అవినీతి రహిత పాలన అందించాలని కోరుతున్నానని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# హైదరాబాద్ జంటనగరాల్లో మళ్లీ వర్షం.. అప్రమత్తంగా ఉండాలన్న పోలీసులు..!



హైదరాబాద్, ఆగష్టు 11:జంట నగరాల పరిధిలో వర్షాలు దంచికొడుతున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో జనం తీవ్ర ఇబ్బందులువడుతున్నారు. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం మళ్లీ జంట నగరాల పరిధిలోని పలుచోట్ల వర్షం పడుతున్నది. సికింద్రాబాద్ పరిధిలోని బోయినపల్లి, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, ప్యాట్నీ, ప్యారడైజ్, బేగంపేట, మారేడ్‌పల్లి, చిలుకలగూడ పడుతున్నది. హయత్‌నగర్ పరిధిలో భారీ వర్షపాతం రికార్డయ్యింది. వర్షానికి హయత్‌నగర్ హైవేపై వరద నీరంతా నిలిచిపోయింది. దాంతో జాతీయ రహదారిపై నీరు నిలువడంతో నెమ్మదిగా వాహనాలు కదులుతున్నాయి. అలాగే, హైదరాబాద్ నగర పరిధిలోని ఎర్రగడ్డ, సనత్‌నగర్, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, బోరబండ, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ప్రగతినగర్, బాచుపల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, కుత్బుల్లాపూర్, దుండిగల్, గండిమైసమ్మ, మల్లంపేట, కొంపల్లి, సుచిత్ర, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, బాలానగర్‌తో పాటు పలు ప్రాంతాల్లోనూ వర్షం కురుస్తున్నది.

ఒక్కసారిగా హైదరాబాద్ నగరాన్ని కారు మబ్బులు కమ్మేసింది. ఒక్కసారిగా కురిసిన వానకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలుచోట్ల వర్షం కారణంగా రోడ్లపై నీరంతా నిలిచిపోయింది. ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది రంగంలోకి నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా.. రాగల 24గంటల్లో హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉ ందని పోలీసులు పేర్కొన్నారు. రాత్రి 11గంటల వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని.. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో వర్షపాతం ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో వాహనదారులు ప్రణాళికలను మేరకు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోవాలని.. అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సూచించారు. వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని.. వర్షం కురిసే సమయంలో భారీ హోర్డింగులు, చెట్ల కింద నిలబడవద్దని అధికారులు సూచిస్తున్నారు. ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. వాహనాలు తక్కువ లోతైన రోడ్లలో మాత్రమే నడపాలని ట్రాఫిక్ పోలీసులు చెప్పారు.

# పుణె జిల్లాలోని ఖేడ్ తాలూఖాలో ఘోర రోడ్డు ప్రమాదం



## -వాహనం అదుపు తప్పి లోయలో పడిపోవడంతో ఏడుగురు మహిళలు మృత్యువాత

పుణె ఆగస్టు 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పుణె జిల్లాలోని ఖేడ్ తాలూఖాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. భక్తులతో ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి లోయలో పడిపోవడంతో ఏడుగురు మహిళలు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో 20 మంది గాయపడ్డారు. కుందేశ్వర్ ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మహిళలు శ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా మహిళలు కుందేశ్వర్‌కు దర్శనం కోసం వెళు న్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 1 గంటల సమయంలో కుందేశ్వర్ గుట్ట మొదటి మలుపు తిరుగుతుండగా.. వాహనం అదుపు తప్పి 100 నుంచి 150 ఫీట్ల లోతులో ఉన్న లోయలో పడిపోయింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు గాయపడిన వారిని వెంటనే చదౌలిలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# విధులు బహిష్కరించిన 'హైడ్రా' మార్షల్స్.. నిలిచిపోయిన ఎమర్జెన్సీ సేవలు

హైదరాబాద్, ఆగష్టు 11:హైడ్రా మార్షల్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఎమర్జెన్సీ సేవలు నిలిచిపోయాయి. తమకు గతంలో ఇచ్చిన జీతాల్లో కోత విధిస్తున్నట్లు ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడం కారణంగానే విధులను బహిష్కరిస్తున్నట్లు హైడ్రా మార్షల్స్ పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎమర్జెన్సీ సేవలు నిలిచిపోవడంతో పాటు 51 హైడ్రా వాహనాలు ఆగిపోయాయి. హైదరాబాద్ నగరంలోని 150 డివిజన్లలో హైడ్రా సేవలకు అంతరాయం ఏర్పడింది.

నగరంలో విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో చాలా వరకు మాజీ సైనిక ఉద్యోగులు సేవలందిస్తున్నారు. అయితే విధులను బహిష్కరించిన మార్షల్స్‌తో హైడ్రా కమిషనర్ చర్చలు జరిపినట్లు సమాచారం. పాత జీతాలే కంటిన్యూ చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. హైడ్రా ఉద్యోగులకు రూ.7000 జీతం తగ్గిస్తూ ఇటీవల ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

# సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్న నీటిపారుదల శాఖ అధికారులు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 11:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల ప్రగతిని సమీక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, పలు ఏజెన్సీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ కలికోట నుండి కుడి ఎడమ కాల్వల నిర్మాణ పనులు, మల్కాపేట రిజర్వాయర్ ఎడమ కాలువ కోసం భూ సేకరణ, వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి ప్రోజెక్టు పనులు, కోనరావుపేట మండల పరిధిలోని లచ్చాపేట తండా రిజర్వాయర్ కాలువ పనులు, చందుర్తి మండల పరిధిలోని ఆశిరెడ్డిపల్లి కొచ్చేరువు, సనుగుల ఎర్ర చెరువు పటేల్ చెరువులోకి నిటితో నింపే ఏర్పాట్లు తదితరాంశాలపై చర్చించారు..ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని, రైతులకు సాగునీరు సకాలంలో అందించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిస్తూ, ఎలాంటి ఆలస్యం లేకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల అమలులో పారదర్శకత పాటించడంతోపాటు, వ్యవసాయ ఉత్పాదకత పెరగడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా అధికారుల నుండి ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు... ఈ సమావేశంలో సీఈ సుధాకర్ రెడ్డి, ఈఈ సంతు ప్రకాష్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు..

# నూతన పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలి : గుండెపిన్ని వెంకటేశ్వర్లు

ఖమ్మం, ఆగష్టు 11:రాష్ట ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు గుండెపిన్ని వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన స్పందిస్తూ.. రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావొస్తున్నా నూతన పెన్షన్లపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కొత్త పెన్షన్ల మంజూరు కోసం వేలాది మంది అర్హులైన వృద్ధులు వితంతువులు, వికలాంగులు దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. అనేకమంది భర్తను కోల్పోయిన వితంతువులు ఏ ఆసరా లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో పెన్షన్ పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు ఆసరా పెన్షన్ దారులకు పెన్షన్ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

# షూటింగ్స్ బంద్ చేయడం సరికాదు

## -మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్, ఆగష్టు 11: తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో వర్కర్స్ ఫెడరేషన్‌కు చెందిన 24 కార్మిక సంఘాలు వేతనాల పెంపు కోసం సినిమా షూటింగ్‌లను నిలిపివేసి బంద్ కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నేడు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఫిల్మ్ ఫెడరేషన్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి మాట్లాడుతూ.. షూటింగ్స్ బంద్ చేయడం సరికాదని కార్మికులకు సూచించారు. పనిచేస్తూనే డిమాండ్లు నెరవేర్చుకోవాలని సూచించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో నిర్మాతలు, కార్మికులకు మధ్య వివాదంపై చర్చించినట్టు సమాచారం. కార్మికుల బంద్ నేపథ్యంలో అంతకుముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు భేటీ అయ్యారు. ఈ సమావేశానికి పలువురు నిర్మాతలు హాజరయ్యారు. సమావేశంలో బాపినీడు, సుప్రియ, జెమినీ కిరణ్, ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ పాల్గొన్నారు.

వర్కర్ల ప్రధాన డిమాండ్ వేతనాలను 30 శాతం వేర పెంచాలని.. ఫెడరేషన్ ప్రతినిధులు ఇప్పటికే ఫిలిం ఛాంబర్‌తో చర్చలు జరిపారని తెలిసిందే. కార్మికులు మరోవైపు హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో కమిషనర్ ఆఫీసుకు కూడా వెళ్లారు. దీంతోపాటు సినీ కార్మికుల వేతనాల పెంపు విషయంపై మరోవైపు నిర్మాతలు చిరంజీవితో సమావేశమై చర్చలు కూడా జరిపారు.

# సినీ కార్మికుల వేతనాల పెంపుపై .. టాలీవుడ్ నిర్మాతల రియాక్షన్

హైదరాబాద్, ఆగష్టు 11: సినీ కార్మికుల వేతనాల పెంపు వివాదం రోజుకో కొత్త టాపిక్‌తో వార్తల్లో నిలుస్తుంది. కార్మికుల సమస్య పరిష్కారం అవుతుందో లేదో అనే దానిపై.. అటూ టాలీవుడ్‌లోనే కాకుండా.. ఇటూ రాష్ట్ర వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ విషయంపై తాజాగా టాలీవుడ్ నిర్మాతలు స్పందించారు. ఇవాళ(సోమవారం) మీడియాతో వారి భావనను వ్యక్త పరుచుకున్నారు.

సినీ కార్మికుల వేతనాలను యాభై శాతం పెంచుతాం.. కానీ తమ సినిమాల పెట్టుబడికి తగ్గ బిజినెస్ ఎవరు చెస్తారని నిర్మాత ఎస్‌కెఎన్ ప్రశ్నించారు. ఆ బాధ్యత సినీ కార్మికుల సంఘాలు తీసుకుంటాయా అని నిలదీశారు. రైట్స్ కాదు రెస్పాన్సిబిలిటీ గురించి మాట్లాడాలన్నారు. చిన్న సినిమాలకు తగ్గట్టుగా వేతనాలను కార్మికులు తీసుకోవటం లేదని స్పష్టం చేశారు. ఇప్పుడు సినిమాలకు సరైన బిజినెస్ అవటం లేదని తెలిపారు. అయినా 2000 లోపు వేతనాలు తీసుకునే కార్మికులకు పెంచుతామన్నట్లు గుర్తు చేశారు. టికెట్ రేట్ల పెంపు పెద్ద సినిమాలకే.. ఏడాదికి అలాంటివి పది మాత్రమే వస్తాయని వివరించారు. మిగతావి 200 సినిమాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. చిన్న సినిమాలకు టికెట్ రేట్లు వర్తించవని తెలిపారు. ఇండస్ట్రీలో నలిగిపోతున్న నిర్మాత పక్కన ఎవరు నిలబడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్ట్ కేసులు ఉన్నవారికి కార్మిక నాయకులుగా ఉ ండే అర్హత లేదని ఆరోపించారు. ఇండస్ట్రీ బాగుంటేనే అందరు బాగుంటారని ఎస్‌కెఎన్ సూచించారు.

నిర్మాతలకు రావాల్సిన పెమెంట్స్ పెండింగ్‌లో ఉంటాయి.. కానీ కార్మికుల వేతనాలు ఏరోజుకారోజే ఇవ్వాలని నిర్మాత రాజేష్ దండ చెప్పుకొచ్చారు. తన గత సినిమాకు 250 వర్కర్స్ రావాల్సి ఉంటే.. అంత మంది వర్కర్స్ రాలేదని తెలిపారు.

# కొత్త ఆదాయపన్ను బిల్లుకు లోక్‌సభలో క్లియరెన్స్



న్యూఢిల్లీ, ఆగష్టు 11: సవరించిన కొత్త ఆదాయ పన్ను బిల్లుకు ఇవాళ లోక్‌సభలో క్లియరెన్స్ దక్కింది. ఇన్‌కం ట్యాక్స్ నెంబర్ 2 బిల్లును ఇవాళ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఆరు దశాబ్దాల క్రితం నాటి 1961 ఇన్‌కం ట్యాక్స్ చట్టాన్ని మార్చాలన్న ఉద్దేశంతో ఈ కొత్త చట్టాన్ని రూపొందించారు. ఆదాయపన్ను చట్టాలను సరళతరం చేయడమే ఈ చట్టం ఉద్దేశం. కొత్త ఆదాయపన్ను చట్టానికి సంబంధించిన ప్రకటన.. ఫిబ్రవరి బడ్జెట్ సమయంలో మంత్రి సీతారామన్ చేసిన విషయం తెలిసిందే. ఆదాయపన్ను చట్టాన్ని సింపుల్‌గా మార్చనున్నట్లు ఆమె చెప్పారు. ఆ ముసాయిదాను సెలెక్ట్ కమిటీకి పంపారు. బైజయంత్ పండా నేతృత్వంలోని కమిటీ 285 సూచనలు చేసింది. దాదాపు అన్ని సలహాలను ఆమోదించారు. దశాబ్ధాల క్రితం నాటి ట్యాక్స్ చట్టాలు ఇప్పుడు సరళతరం అయ్యాయని పండా తెలిపారు. వ్యక్తిగత పన్నుదారులు, ఎంఎస్ఎంఈలు.. అనవసర గందరగోళం నుంచి తప్పించుకోవచ్చు అన్నారు.

# భరోసా కేంద్రాల్లో బాధితులకు నైపుణ్యాలు నేర్పించాలి..

## -సఖి సెంటర్స్ పరిశీలనలో కలెక్టర్ రాహుల్ రాజ



మెదక్, ఆగష్టు 11:సఖి కేంద్రాల ద్వారా మహిళల హక్కులపై అవగాహన కల్పించాలని, లైంగిక దాడికి గురైన బాధితులకు అండగా భరోసా సెంటర్స్ రక్షణ కల్పిస్తాయని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలో గల భరోసా, సఖి సెంటర్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా భరోసా సెంటర్స్ సందర్శించి లీగల్, మెడికల్, చిన్నారుల, కౌన్సిలింగ్ స్టేట్‌మెంట్ రికార్డింగ్ చేయు గదులను పరిశీలించి భరోసా సెంటర్ నిర్వాహణ తీరును ఆరా తీశారు.

బాధితులకు నైపుణ్యాలు నేర్పించి సమాజంలో ఉన్నతంగా జీవించేలా భరోసా సెంటర్స్ దోహదపడతాయని కలెక్టర్ రాహుల్ రాజ్ ఈ సందర్భంగా అన్నారు. అనంతరం సఖి సెంటర్ ను సందర్శించి నిర్వహణ తీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సఖి సెంటర్ ద్వారా ఇప్పటివరకు 1391 కేసులు పెట్టామని 1131 కేసులకు వివిధ రకాల న్యాయ సేవలు అందించినట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు.

సఖి కేంద్రానికి వచ్చే బాధితులకు భరోసానిచ్చి న్యాయం అందించేలా చూడాలని కలెక్టర్ ఈ సందర్భంగా నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం నిర్వాహకులు రేణుక, లీగల్ కౌన్సిలర్ నిర్మల, ఐపీ అసిస్టెంట్ రమేష్, ఉమామహేశ్వరి సిబ్బంది భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# లారీ, కారు ఢీ.. ఇద్దరు మృతి

నంద్యాల, ఆగష్టు 11: రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లా వాసులు ఇద్దరు మృతి చెందిన సంఘటన ఇవాళ చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు- కడప నగర సమీపంలో కారు, లారీ ఢీకొన్న సంఘటనలో ఆళ్లగడ్డ మండలం ఎస్.లింగందిన్నె గ్రామానికి చెందిన దూదేకుల వినయ్ కుమార్ (36), ఆళ్లగడ్డకు చెందిన హుస్సేనమ్మ (43)లు అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు.

కారులో ఉన్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కారు నుజ్జుయిపోయింది. గాయపడిన వారు పరిస్థితి తీవ్రంగా ఉండటంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిస్థితి మెరుగుపడకపోవటంతో తిరిగి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారు తీసుకుని దైవ దర్శనం కోసం అరుణాచలం వెళ్లి తిరిగి వస్తుండగా లారీ, కారు ఢీకొన్నాయి. ఇరువురు మృతిచెందిన సంఘటనతో ఆళ్లగడ్డ మండలంలోనూ ఎన్.లింగం దిన్నె గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# 'పిల్లల్లో నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు వేయాలి'



నల్గొండ, ఆగషు 11: పిల్లల్లో నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు తప్పని సరిగా వేయాలని పెన్‌పహాడ్ మండల తాసీల్దార్ లాలూ నాయక్, ఎంపీడీఓ జానయ్య, వైద్యాధికారి రాజేశ్ అన్నారు. సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

నులి పురుగుల ప్రభావంతో పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, విరేచనాలు బరువు తగ్గడం గ్రహించవచ్చన్నారు. నులి పురుగులతో పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి కుంటుపడుతుందని, విషయ సంగ్రహణ దెబ్బతింటుందన్నారు. తద్వారా వారి అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవి. అనంతలక్ష్మి, కృష్ణ ప్రసాద్, వెంకన్న, వీరమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

# దారుణం.. ప్రేమను నిరాకరించిందనే కోపంతో విద్యార్థినిని కాల్చిచంపిన టీచర్..!

న్యూఢిల్లీ, ఆగష్టు 11: ఆమె ఒక విద్యార్థిని అతడు ఒక టీచర్ . పిల్లలకు విద్యాబుద్ధులతోపాటు సంస్కారం నేర్పాల్సిన బాధ్యత అతడిది. కానీ అతడే సంస్కార హీనంగా ప్రవర్తించాడు.

ప్రేమ పేరుతో విద్యార్థినిని వేధించాడు. వేగలేక ఆమె అతడి ప్రేమను నిరాకరించడంతో దారుణానికి ఒడిగట్టాడు. తుపాకీతో ఆమెను కిరాతకంగా కాల్చిచంపాడు. బీహార్ లోని సమస్తిపూర్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. సమస్తిపూర్ జిల్లాలోని పర్సా పంచాయతీకి చెందిన 19 ఏళ్ల గుడియా కుమారి బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు సిద్ధమవుతోంది. అదే ఏరియాలో నలందా జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఇవాళ (సోమవారం) గుడియా బహేరి బ్లాక్‌లోని కోచింగ్ సెంటర్ నుంచి ఇంటికి తిరిగి వెళుతుండగా శివాజీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొథియాన్ గ్రామం వద్ద స్కూల్ టీచర్ ఆమెను అడ్డగించాడు.

'నేను నిన్ను ప్రేమిస్తున్నా. నన్ను పెళ్లి చేసుకోవాలి' అని ఆమెపై ఒత్తిడి చేశాడు. దాంతో ఎప్పటిలాగే ఆమె తాను ప్రేమించడంలేదని కరాకండిగా చెప్పింది.

దాంతో అప్పటికే పథకం ప్రకారం తుపాకీతో వచ్చిన అతడు అతి సమీపం నుంచి కాల్పులు జరిపాడు. ఆ కాల్పుల్లో గుడియా అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. ఆ తర్వాత నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు.

నిందితుడు పనిచేస్తున్న ప్రైవేట్ పాఠశాలకు నిప్పుపెట్టారు. అనంతరం సింఘియా-బహేరి-దర్భంగా ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. నిందితుడిని తక్షణమే అరెస్ట్ చేయాలని, ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. నిందితుడు తమ కుమార్తెను చాలాకాలంగా బెదిరిస్తున్నాడని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందని వారు కన్నీరుమున్నీరయ్యారు.

ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించామని చెప్పారు. పారిపోయిన నిందితుడి కోసం గాలిస్తున్నామని అన్నారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుని తగిన శిక్ష పడేలా చేస్తామని చెప్పారు.

# ఢిల్లీలో పార్లమెంటు సభ్యుల కోసం కొత్తగా నిర్మించిన ఫ్లాట్‌లను ప్రారంభించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 11:ఢిల్లీలోని బాబా ఖరక్ సింగ్ మార్గ్‌లో పార్లమెంటు సభ్యుల కోసం కొత్తగా నిర్మించిన 184 టైప్?ఎఎఎ బహుళ అంతస్తుల ఫ్లాట్‌లను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2025 ఆగస్టు 11న ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు.

ఈ నివాస ప్రాంగణంలో ప్రధానమంత్రి సిందూర్ మొక్కను నాటనున్నారు. కార్మికులతో కూడా ఆయన సంభాషించనున్నారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవాన్ని ఉద్దేశించి ప్రధాని ప్రసంగించనున్నారు.

ఈ భవన సముదాయాన్ని స్వయం సమృద్ధిగా ఉండేలా నిర్మించారు. పార్లమెంటు సభ్యులు పని చేసుకునేందుకు వీలుగా పూర్తి స్థాయి ఆధునిక సౌకర్యాలు ఈ ఫ్లాట్‌లలో ఉన్నాయి. హరిత సాంకేతికతతో ఉన్న ఈ సముదాయం గృహ-3 స్టార్ రేటింగ్ ప్రమాణాలతో ఉంది. దీనిని జాతీయ భవన నిర్మాణ నియమావళి (ఎన్‌బీసీ) - 2016కు అనుగుణంగా నిర్మించారు. పర్యావరణ సుస్థిరత విషయంలో సరిపడా చర్యలు తీసుకున్నారు. ఇవి ఇంధన పరిరక్షణ, పునరుత్పాదక ఇంధనోత్పత్తి, ప్రభావవంతమైన వ్యర్థాల నిర్వహణకు దోహదపడతాయని భావిస్తున్నారు. అధునాతన నిర్మాణ సాంకేతికతలను, ముఖ్యంగా అల్యూమినియం రేకులను ఉపయోగించి కాంక్రీటుతో నిర్మించే పద్ధతి (మోనోలితిక్ కాంక్రీట్ విత్ అల్యూమినియం షట్టరింగ్) ద్వారా దృఢత్వంతో కూడిన ఈ ఇళ్ల నిర్మాణం సకాలంలో పూర్తైంది. దివ్యాంగులకు కూడా ఇది అనుకూలంగా ఉండనుంది. ఇది భవనాల నిర్మాణంలో సమ్మిళితత్వానికి ఇచ్చిన ప్రాధాన్యతను తెలియజేస్తోంది.

పార్లమెంటు సభ్యులకు సరిపడా ఇళ్లు లేని కారణంగా ఈ ప్రాజెక్టును చేపట్టాల్సి వచ్చింది. కావాల్సినంత భూమి లభించకపోవటం వల్ల భూ వినియోగాన్ని మెరుగుపరిచేందుకు, నిర్వహణ ఖర్చులను తగ్గించే లక్ష్యంతో ఒకదాని మీద ఒక ఇళ్లు నిర్మించే పద్ధతికి (వర్టికల్ హౌసింగ్) ప్రాధాన్యతనిచ్చారు.

ప్రతి ఇంటిలో సుమారు 5,000 చదరపు అడుగుల ఉపయోగించదగిన స్థలం (కార్పెట్ ఏరియా) ఉంది. దీనివల్ల నివాస, అధికారిక పనులకు కావాల్సినంత స్థలం లభిస్తుంది. కార్యాలయాలు, సిబ్బంది వసతి, సామాజిక కేంద్రానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రజా ప్రతినిధులుగా పార్లమెంటు సభ్యులు బాధ్యతలను నిర్వర్తించడంలో ఇవి సహాయపడనున్నాయి.

సముదాయంలోని అన్ని భవనాలను భూకంప నిరోధకత సాంకేతికతతో ఆధునిక నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా నిర్మించారు. ఇక్కడ ఉండే వారి భద్రతను నిర్ధారించేందుకు సమగ్రమైన పకడ్బందీ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. బస్సుల్లో సీసీ కెమెరాలు.. కండక్టర్లకు బాడీ వార్న్ కెమెరాల ఏర్పాటుకు ఆదేశాలు

అమరావతి, ఆగషు 11: ఏపీలో ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. స్త్రీ శక్తి పేరిట ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన మార్గదర్శకాలను తాజాగా విడుదల చేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం ఐదు కేటగిరీ బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నారు.

పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. బాలికలు, మహిళలతో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా ఉచిత ప్రయాణం అందించను న్నారు. నాన్‌స్టాప్, సరిహద్దు రాష్ట్రాల మధ్య తిరిగే అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు. తిరుమల ఘాట్ రోడ్డుపైకి వెళ్లే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం లేదు. అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, ఏసీ బస్సుల్లో ఈ పథకం వర్తించదు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ కార్డు లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదో ఒక కార్డు చూపించి మహిళలు ఈ ఉచిత బస్సు ప్రయాణం పొందవచ్చు. బస్సు ఎక్కిన మహిళలకు జీరో ఫేర్ టికెట్లను జారీ చేస్తారు. ఆ ఖర్చును ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేయనుంది.మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగు చర్యలు తీసుకోనున్నారు. అన్ని బస్సుల్లో సీసీ కెమెరాలు, కండక్టర్లకు బాడీ వార్న్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీఎస్ ఆర్టీసీ పరిధిలో మొత్తం 11,449 బస్సులు ఉన్నాయి. వీటిలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు(5851), ఎక్స్‌ప్రెస్‌లు (1610), సిటీ ఆర్డినరీ (710), సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ (287)లు కలిపి మొత్తం 8,458 బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నారు. అల్ట్రా డీలక్స్ (643), సూపర్ లగ్జరీ (1486), నాన్ ఏసీ స్లీపర్ స్టార్‌లైనర్ (59), ఏసీ బస్సులు (459), తిరుమల ఘాట్ బస్సులు (344) కలిపి మొత్తం 2991 బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం అనుమతించరు.

# మన తదుపరి ప్రధాన లక్ష్యం సాంకేతిక రంగంలో స్వావలంబన సాధించడమే: ప్రధాని

న్యూఢిల్లీ, ఆగష్టు 11:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు కర్ణాటకలోని బెంగళూరులో సుమారు రూ.7,160 కోట్లతో చేపట్టిన బెంగళూరు మెట్రో యెల్లో లైన్‌ను ప్రారంభించారు. మరోవక్క రూ.15,610 కోట్లకు పైగా విలువైన బెంగళూరు మెట్రో 3వ దశ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే బెంగళూరులోని కేఎస్ఆర్ రైల్వే స్టేషన్ నుంచి మూడు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. ఈ సందర్భంగా ఆయన సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. కర్ణాటక నేలపై కాలుపెట్టగానే ఒక అనిర్వచనీయ అనుభూతి కలిగిందని పేర్కొన్నారు. కర్ణాటక సంస్కృతి వైభవం, ప్రజల స్నేహపూర్వకత, హృదయాన్ని హత్తుకునే కన్నడ భాష మాధుర్యాన్ని ప్రస్తావిస్తూ... శ్రీ మోదీ ముందుగా బెంగళూరుకు అధిష్ఠాన దేవత అన్నమ్మ తాయికి నమస్కరించారు. శతాబ్దాల క్రితం నాదప్రభు కెంపెగౌడ బెంగళూరు నగరానికి పునాది రాయి వేశారని గుర్తుచేసిన ప్రధానమంత్రి, సంప్రదాయాలతో మమేకమై అభివృద్ధి శిఖరాలను అధిరోహించే నగరాన్ని కెంపెగౌడ ఆనాడే ఊహించారని అన్నారు. "బెంగళూరు ఎల్లప్పుడూ ఆ భావాన్ని కొనసాగిస్తూ దాన్ని కాపాడుతూ వచ్చింది. ఈ రోజు ఆ కలను సాకారం చేసుకుంటోంది" అని ప్రధాని అన్నారు.

"ఈ రోజు, బెంగళూరు నవ భారత పురోగమనానికి ప్రతీకగా నిలిచిన నగరంగా వెలుగొందుతోంది" అని శ్రీ మోదీ తెలిపారు. తాత్విక జ్ఞానాన్ని చెక్కుచెదర నీయక సాంకేతిక నైపుణ్యాన్ని కార్యాచరణలో ప్రతిబింబించే నగరంగా ఆయన బెంగళూరును వర్ణించారు. భారతదేశాన్ని సగర్వంగా ప్రపంచ ఐటీ పటంలో నిలిపిన నగరంగా బెంగళూరును అభివర్ణిస్తూ, ఈ విజయగాథకు ఇక్కడి ప్రజల కష్టపడి పనిచేసే స్వభావం, ప్రతిభే కారణమని ఆయన పేర్కొన్నారు.

"21వ శతాబ్దంలో నగరాల అభివృద్ధి ప్రణాళికలు, పట్టణ మౌలిక వసతులు అత్యంత కీలకమైన అవసరాలు" అని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. బెంగళూరు వంటి నగరాలు భవిష్యత్తు పయనానికి సిద్ధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో భారత ప్రభుత్వం బెంగళూరుకు వేల కోట్ల రూపాయల విలువైన అనేక ప్రాజెక్టులను అందించిందని, ఈ రోజు మరో ముందడుగు పడిందని అన్నారు. శ్రీ మోదీ బెంగళూరు మెట్రో యెల్లో లైన్‌ను ప్రారంభించడంతోపాటు మెట్రో మూడో దశకు పునాది రాయివేశారు. దేశంలోని విభిన్న ప్రాంతాలను అనుసంధానించే మూడు కొత్త వందే భారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. బెంగళూరు?బెలగావి వందే భారత్ సర్వీస్ ప్రారంభం కావడంతో బెలగావిలో వాణిజ్య, పర్యాటక రంగాలు గణనీయంగా అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. అలాగే నాగ్‌పూర్?పూణే మధ్య, శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా ?అమృతసర్ మధ్య కూడా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రారంభమయ్యాయి. ఈ సర్వీసులు లక్షలాది భక్తులకు ప్రయోజనం చేకూర్చి పర్యాటకాన్ని ప్రోత్సహిస్తాయని ప్రధానమంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టులు, కొత్త వందే భారత్ రైళ్ల ప్రారంభం నేపథ్యంలో ఆయన బెంగళూరు, కర్ణాటకతో పాటు యావత్ దేశ ప్రజానీకానికి శుభాకాంక్షలు అందజేశారు.

ఆపరేషన్ సిందూర్ తర్వాత తాను బెంగళూరుకు రావడం ఇదే మొదటిసారని పేర్కొంటూ.. భారత దళాలు ఆపరేషన్ సిందూర్లో సాధించిన విజయాన్ని శ్రీ మోదీ ప్రస్తావించారు. సరిహద్దు దాటి తీవ్రవాద స్థావరాలను ధ్వంసం చేసే సామర్థ్యాన్ని వారు ప్రదర్శించారని ఆయన తెలిపారు. తీవ్రవాదుల కొమ్ముకాసిన పాకిస్థాన్ ను గంటల వ్యవధిలో మోకాళ్లపై కూర్చోబెట్టిన భారత శక్తిని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. "నవ భారతావని కొత్త రూపాన్ని ప్రపంచం మొత్తం చూసింది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ విజయానికి రక్షణ రంగంలో సాంకేతిక శక్తి, మేక్ ఇన్ ఇండియా బలం ప్రధాన కారణమని ఆయన వివరించారు. ఈ విజయానికి బెంగళూరు, కర్ణాటక యువత అందించిన విశిష్ట సహకారాన్ని గుర్తిస్తూ అందరికీ ఆయన అభినందనలు తెలిపారు.

ఇప్పుడు ప్రపంచంలోని ప్రధాన నగరాల సరసన బెంగళూరు గుర్తింపు పొందిందని పేర్కొంటూ, భారత్ ప్రపంచస్థాయిలో పోటీపడడమే కాకుండా ముందుండాలని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. మన నగరాలు స్మార్ట్‌గా, వేగంగా, సమర్థవంతంగా మారినప్పుడే పురోగతి సాధ్యమవుతుందని, ఆధునిక మౌలిక ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఆయన తెలిపారు. ఆర్వీ రోడ్ నుంచి బొమ్మసంద్ర వరకు బెంగళూరు మెట్రో యెల్లో లైన్ ను ప్రారంభిస్తున్నట్లు శ్రీ మోదీ ప్రకటించారు. ఇది బెంగళూరులోని అనేక ముఖ్య ప్రాంతాలను అనుసంధానిస్తుందని చెప్పారు. బసవనగుడి, ఎలక్ట్రానిక్ సిటీ మధ్య ప్రయాణ సమయం ఇప్పుడు గణనీయంగా తగ్గుతుందని, ఇది లక్షలాది మందికి జీవన సౌలభ్యం, పని సౌకర్యాన్ని పెంచుతుందని ఆయన పేర్కొన్నారు.

యెల్లో లైన్ ప్రారంభంతో పాటు బెంగళూరు మెట్రో మూడో దశ -అంటే ఆరెంజ్ లైన్- కు కూడా పునాది రాయివేసినట్లు ప్రధానమంత్రి ప్రకటించారు. ఆరెంజ్ లైన్ కూడా అందుబాటులోకి వస్తే రెండింటితో కలిపి రోజుకు 25 లక్షల మంది ప్రయాణికుల రాకపోకలకు వీలవుతుందని ఆయన తెలిపారు. ఇది బెంగళూరు రవాణా వ్యవస్థను మరింత శక్తిమంతం చేసి కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని అన్నారు. బెంగళూరు మెట్రో దేశంలో ప్రజా మౌలిక వసతుల అభివృద్ధికి ఒక కొత్త మోడల్‌ను పరిచయం చేసిందని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్, బయోకాన్, డెల్టా ఎలక్ట్రానిక్స్ వంటి సంస్థలు పలు కీలక మెట్రో స్టేషన్లకు కొంతమేర నిధులు సమకూర్చాయని ఆయన ప్రస్తావించారు. ఈ వినూత్న సీఎస్ఆర్ ప్రయత్నం ఒక ప్రేరణగా నిలుస్తుందని ప్రశంసిస్తూ, సహకారమందించిన కార్పొరేట్ రంగానికి ఆయన అభినందనలు తెలిపారు.

"భారత్ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ. గత పదకొండు సంవత్సరాల్లో, భారత ఆర్థిక వ్యవస్థ 10వ స్థానం నుంచి ప్రపంచంలో ఐదు అగ్రస్థాయి దేశాల్లో ఒకటిగా ఎదిగి ఇప్పుడు తొలి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మారే దిశగా వేగంగా పయనిస్తోంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. కచ్చితమైన సంకల్పం, నిజాయితీ తో కూడిన కృషి ప్రధానాంశాలుగా "రిఫార్మ్, పర్ఫార్మ్ అండ్ ట్రాన్స్‌ఫార్మ్" భావన ఈ పురోగతికి ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధిని ప్రస్తావిస్తూ, 2014లో మెట్రో సేవలు కేవలం ఐదు నగరాలకే పరిమితమై ఉన్నాయని ప్రధాని గుర్తుచేశారు. ఈ రోజు, 24 నగరాల్లో 1,000 కి.మీ.కుపైగా విస్తరించిన మెట్రో నెట్‌వర్క్‌తో, భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్ కలిగిన దేశంగా నిలిచిందని ఆయన తెలిపారు. 2014కు ముందు రైల్వే మార్గాల్లో కేవలం 20,000 కి.మీ. రైల్వే మార్గాలను మాత్రమే విద్యుదీకరించగా, గత పదకొండు సంవత్సరాల్లోనే 40,000 కి.మీ.కుపైగా రైల్వే మార్గాలు విద్యుదీకరించామని, ఇది సుస్థిర రవాణా అభివృద్ధిలో ఒక విశేషమైన ముందడుగని ఆయన పేర్కొన్నారు.

భారత్ విజయాలు పుడమికే పరిమితం కాలేదని, నింగిని సైతం తాకాయని పేర్కొంటూ.. 2014లో దేశంలో కేవలం 74 విమానాశ్రయాలే ఉండగా, ఈ రోజు ఆ సంఖ్య 160 దాటిందని ప్రధానమంత్రి వెల్లడించారు. అలాగే, జలమార్గాల అభివృద్ధిలో సాధించిన విశేష పురోగతిని ప్రస్తావిస్తూ, 2014లో కేవలం మూడు జాతీయ జలమార్గాలే కార్యకలాపాలు నిర్వహిస్తూండగా ఇప్పుడా సంఖ్య ముప్పైకి పెరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఆరోగ్య, విద్యా రంగాల్లో భారత్ సాధించిన విశేష ప్రగతిని ప్రస్తావిస్తూ 2014 వరకు దేశంలో కేవలం 7 ఎయిమ్స్, 387 వైద్య కళాశాలలే ఉండగా ఈ రోజు 22 ఎయిమ్స్, 704 వైద్య కళాశాలలు ప్రజలకు సేవలందిస్తున్నాయని శ్రీ మోదీ తెలిపారు. గత 11 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా లక్షకు పైగా కొత్త వైద్య సీట్లు పెరిగాయని ఆయన పేర్కొన్నారు. ఫలితంగా మధ్యతరగతి పిల్లలు విస్తృత అవకాశాలను పొందారని ఆయన హైలైట్ చేశారు. గత 11 సంవత్సరాల్లో ఐఐటీల సంఖ్య 16 నుంచి 23కు, ఐఐఐటీల సంఖ్య 9 నుంచి 25కు, ఐఐఎంల సంఖ్య 13 నుంచి 21కు పెరిగిందని శ్రీ మోదీ తెలిపారు. ఈ రోజు విద్యార్థులకు ఉన్నత విద్యలో మరిన్ని అవకాశాలు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

ఈ రోజు దేశం వేగంగా పురోగమిస్తున్నవేళ పేదలు, అణగారిన వర్గాల జీవితాలు కూడా అదే స్థాయిలో మారుతున్నాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 4 కోట్లకు పైగా పక్కా ఇళ్లు అందించామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పుడు మరో 3 కోట్లు ఇళ్లు నిర్మించడానికి సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. కేవలం 11 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించామని శ్రీ మోదీ తెలిపారు. ఈ కార్యక్రమం కోట్లాది తల్లులు, అక్కాచెల్లెమ్మలకు గౌరవం, శుభ్రత, భద్రతను అందించిందని ఆయన పేర్కొన్నారు.

"దేశంలో జరుగుతున్న వేగవంతమైన అభివృద్ధి కార్యక్రమాలన్నీ భారత ఆర్థిక వృద్ధికి అనుగుణంగా ముందుకు సాగుతున్నవే" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు. 2014కు ముందు భారత మొత్తం ఎగుమతులు 468 బిలియన్ డాలర్లు ఉండగా, ఈ రోజు ఆ సంఖ్య 824 బిలియన్ డాలర్లకు పెరిగిందని ఆయన పేర్కొన్నారు. గతంలో భారత్ మొబైల్ ఫోన్లను దిగుమతి చేసుకునేదని, కానీ ఇప్పుడు మొబైల్ హ్యాండ్‌సెట్లను ఎగుమతి చేసే అయిదు అగ్రగామి దేశాల్లో ఒకటిగా మారిందని ప్రధాని తెలిపారు. ఈ మార్పులో బెంగళూరు కీలక పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. అలాగే 2014కు ముందు భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు సుమారు 6 బిలియన్ డాలర్లు ఉండగా, ఇప్పుడవి దాదాపు 38 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు ఆయన వెల్లడించారు.

పదకొండు సంవత్సరాల క్రితం భారత ఆటోమొబైల్ ఎగుమతులు సుమారు 16 బిలియన్ డాలర్లు ఉండగా, ఈ రోజు ఆ సంఖ్య రెండింతలకు పైగా పెరిగి, భారత్‌ను ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆటోమొబైల్ ఎగుమతిదారుగా నిలిపిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ విజయాలు ఆత్మనిర్భర్ భారత్ సంకల్పాన్ని మరింత బలపరుస్తాయని, దేశం కలిసి ముందుకు సాగి వికసిత భారతాన్ని నిర్మిస్తుందని ఆయన పేర్కొన్నారు.

"వికసిత భారత్ ప్రయాణం డిజిటల్ ఇండియాతో చేయి చేయి కలుపుకొని ముందుకు సాగుతుంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఇండియా ఏఐ మిషన్ వంటి కార్యక్రమాల ద్వారా భారత్ ప్రపంచ స్థాయి ఏఐ నాయకత్వం వైపు దూసుకెళ్తోందని తెలిపారు. సెమీకండక్టర్ మిషన్ కూడా ఊపందుకుంటోందని, త్వరలోనే భారత్ తన సొంత మేడ్-ఇన్-ఇండియా చిప్‌ను కలిగి ఉంటుందని ఆయన అన్నారు. తక్కువ వ్యయంతో హైటెక్ అంతరిక్ష మిషన్లలో భారత్ ప్రపంచానికి ఒక ఆదర్శంగా మారిందని ప్రధాని పేర్కొన్నారు. భవిష్యత్ సాంకేతిక రంగాలన్నింటిలోనూ భారత్ పురోగమిస్తోందని, ఈ అభివృద్ధిలో అత్యంత విశేషమైన అంశం పేదల సాధికారత అని ఆయన పేర్కొన్నారు. డిజిటలైజేషన్ ఇప్పుడు దేశంలోని ప్రతి గ్రామానికి చేరుకుందని, యూపీఐ ద్వారా ప్రపంచంలోని రియల్ టైమ్ లావాదేవీలలో 50% కంటే ఎక్కువ భారత్ ఖాతాలోనే ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం, ప్రజల మధ్య దూరాన్ని సాంకేతికత తగ్గిస్తోందని, ప్రస్తుతం 2,200కుపైగా ప్రభుత్వ సేవలు మొబైల్ ప్లాట్‌ఫామ్‌లపై అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఉమాంగ్ యాప్ ద్వారా ప్రజలు ఇళ్ల నుంచే ప్రభుత్వ పనులు పూర్తిచేసుకోవచ్చని, డిజిలాకర్ ద్వారా ప్రభుత్వ సర్టిఫికేట్ల నిర్వహణలోని ఇబ్బందులు తొలగిపోయాయని ఆయన అన్నారు. భారత్ ఇప్పుడు ఏఐ ఆధారిత ముప్పు గుర్తింపు వంటి సాంకేతికతల్లో పెట్టుబడులు పెడుతోందని, డిజిటల్ విప్లవ ప్రయోజనాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరేలా చేయడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ యత్నంలో బెంగళూరు చురుగ్గా సహకరిస్తోందని ప్రధాని గుర్తించారు.

"మన తదుపరి ప్రధాన లక్ష్యం సాంకేతిక రంగంలో స్వావలంబన సాధించడమే" అని ప్రధానమంత్రి ప్రకటించారు. భారతీయ టెక్ కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతూ, మొత్తం ప్రపంచానికి సాఫ్ట్‌వేర్, ఉత్పత్తులను అభివృద్ధి చేశాయని ఆయన వెల్లడించారు. ఇప్పుడు భారత్ సొంత అవసరాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం వచ్చిందని, ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, యాప్‌లను ప్రతి రంగంలోనూ ఉపయోగిస్తున్న ఈ కాలంలో కొత్త ఉత్పత్తుల అభివృద్ధిని వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ రంగంలో భారత్ కొత్త శిఖరాలను చేరుకోవడం అవసరమని ప్రధాని పేర్కొన్నారు. వికసిస్తున్న రంగాల్లో ముందంజలో ఉండేందుకు కేంద్రీకృత కృషి చేయాలని పిలుపునిస్తూ, మేక్ ఇన్ ఇండియా, తయారీ రంగాల్లో బెంగళూరు, కర్ణాటక ప్రాధాన్యతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. భారత ఉత్పత్తులు "జీరో డిఫెక్ట్, జీరో ఎఫెక్ట్" ప్రమాణాలను అనుసరించాలి... అంటే అవి నాణ్యతా లోపంలేకుండా, పర్యావరణ హితంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ దృష్టిని కర్ణాటక ప్రతిభ ముందుండి నడిపిస్తుందన్న నమ్మకాన్ని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వమైనా, రాష్ట్ర ప్రభుత్వాలైనా ప్రజాసేవకే కట్టుబడి ఉన్నాయని, పౌరుల జీవితాలను మెరుగుపర్చడానికి సమష్టి కృషి అవసరమని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ దిశలో కొత్త సంస్కరణలను అమలు చేయడం ఒక కీలక బాధ్యత అని ఆయన అన్నారు. గత దశాబ్దంలో కేంద్ర ప్రభుత్వం నిరంతరం సంస్కరణల పథంలో పయనించిందని ప్రధాని తెలిపారు. ఉదాహరణకు, చట్టాలను డీక్రిమినలైజ్ చేయడానికి జన విశ్వాస్ బిల్లును ఆమోదించామని, జన విశ్వాస్ 2.0 కూడా ప్రవేశపెడుతున్నామని ప్రకటించారు. అవసరం లేని క్రిమినల్ నిబంధనలతో ఉన్న చట్టాలను గుర్తించి, వాటిని తొలగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్య ఆధారిత శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా మిషన్ కర్మయోగి కార్యక్రమాన్ని ప్రస్తావించిన ఆయన, రాష్ట్రాలు కూడా తమ అధికారుల కోసం ఈ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్‌ను చేపట్టవచ్చని సూచించారు. ఆశావహ జిల్లాల కార్యక్రమం, ఆశావహ బ్లాక్ కార్యక్రమంపై దృష్టి సారిస్తూ, ప్రత్యేక శ్రద్ధ అవసరమైన ప్రాంతాలను రాష్ట్రాలు కూడా గుర్తించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో నిరంతర సంస్కరణలను కొనసాగించాలనీ, ఈ సంయుక్త ప్రయత్నాలు కర్ణాటకను అభివృద్ధిలో కొత్త స్థాయిలకు తీసుకెళ్తాయని, ఫలితంగా వికసిత భారత్ దృష్టి సాకారమవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

కర్ణాటక గవర్నర్ శ్రీ థావర్ చంద్ గెహ్లోత్, కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ సిద్దరామయ్య, కేంద్ర మంత్రులు శ్రీ మనోహర్ లాల్, శ్రీ హెచ్.డి. కుమారస్వామి, శ్రీ అశ్విని వైష్ణవ్, శ్రీ వి. సోమన్న, సుశ్రీ శోభా కరంద్లాజే తదితర విశిష్ట అతిథులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ, రూ. 7,160 కోట్ల వ్యయంతో 19 కి.మీ.కు పైగా పొడవు, 16 స్టేషన్లు కలిగిన బెంగళూరు మెట్రో ఫేజ్-2 ప్రాజెక్ట్‌లోని ఆర్వీ రోడ్ (రగిగుట్ట) నుంచి బొమ్మసంద్ర వరకు ఉన్న యెల్లో లైన్‌ను ప్రారంభించారు. దీంతో బెంగళూరులో మెట్రో నెట్‌వర్క్ 96 కి.మీ.కు పైగా పెరిగి, ఈ ప్రాంతంలోని అధిక జనాభాకు సేవలు అందిస్తుంది.

రూ.15,610 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించనున్న బెంగళూరు మెట్రో ఫేజ్-3 ప్రాజెక్ట్‌కు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ మొత్తం మార్గ పొడవు 44 కి.మీ.పైగా ఉండి, 31 ఎలివేటెడ్ స్టేషన్లు కలిగి ఉంటుంది. ఈ మౌలిక వసతుల ప్రాజెక్ట్ నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చడమే కాకుండా, నివాస, పారిశ్రామిక, వాణిజ్య, విద్యా ప్రాంతాలకు అనుకూలంగా ఉంటుంది.

బెంగళూరు నుంచి మూడు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా ప్రధాన మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. వీటిలో బెంగళూరు?బెలగావి, అమృతసర్?శ్రీమాత వైష్ణో దేవి కత్రా, నాగ్‌పూర్ (అజ్నీ)?పూణే రైళ్లు ఉన్నాయి. ఈ హైస్పీడ్ రైళ్లు ప్రాంతీయ అనుసంధానాన్ని గణనీయంగా పెంచి, ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు ప్రయాణికులకు ప్రపంచస్థాయి ప్రయాణ అనుభవాన్ని అందిస్తాయి.

# కేజీబీవీ బోనకల్లులో అల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఖమ్మం, ఆగష్టు 11:బోనకల్లు మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో సోమవారం మండల అధికారులు నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ.. గవర్నమెంట్, ప్రైవేట్ స్కూళ్లు, అంగన్‌వాడీ సెంటర్, జూనియర్ కాలేజీ నందు అల్బెండజోల్ మాత్రలు వేయటం జరిగిందనారు. 6,208 మంది పిల్లలకు గాను 5,866 మందికి ఈ మాత్రలను వేసినట్లు చెప్పారు. మిగిలిన వారికి ఈ నెల 18న ఈ టాబ్లెట్లు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, ఎంఈఓ దామాల పుల్లయ్య, ఎస్ఓ సక్కుబాయి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం : జడ్జి ఎం.నాగరాజు



నల్గొండ, ఆగషు 11:క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని నల్లగొండ జిల్లా ప్రధాన జడ్జి ఎం.నాగరాజు అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ నల్లగొండ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా న్యాయవాదులకు స్థానిక మేకల అభినవ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిరంతరం బిజీగా ఉండే న్యాయవాదులకు క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా న్యాయవాదులకు క్యారమ్స్, చెస్, క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఇండోర్, ఔట్‌డోర్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి సంపూర్ణ ఆనంద్, కార్యదర్శి మంద నగేశ్, కోశాధికారి బరిగల నగేశ్, జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వీరబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి : ఏవో శ్రీనివాస్



మెదక్ , ఆగస్టు 11: కొత్తగా పాస్ బుక్కులు పొందిన రైతులు రైతు బీమా దరఖాస్తు చేసుకోవడానికి క్లస్టర్ ఏఈవోలను సంప్రదించాలని ఏవో శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మెదక్ వ్యవసాయ కార్యాలయంలో ఏవో మాట్లాడుతూ.. జూన్ 5 వరకు కొత్తగా పట్టాదారు పాస్‌బుక్ వచ్చిన రైతులు రైతు బీమాకు చివరి తేదీ ఆగస్టు 13లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రైతు బీమాకు 18-59 ఏండ్ల వయసు గల రైతులు అర్హులని తెలిపారు. రైతులు దరఖాస్తు చేసుకోవాల్సిన పత్రాలు దరఖాస్తు ఫారం, రైతు పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ మీ క్లస్టర్ ఏఈవోలకు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో సూచించారు.

